క్లుప్తంగా

రీ సర్వే పనుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఐఓఎస్‌లు

సి.బెళగల్: మండల కేంద్రంలో వీఆర్వోలు, సర్వే అధికారులు చేపట్టిన భూముల రీసర్వే పనులను జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐఓఎస్) అధికారులు సుధాకర్, సుజాత తనిఖీ చేశారు. గురువారం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం ఆధ్వర్యంలో ఏడు బృందాల వీఆర్వోలు, సర్వే సహాయకులతో గ్రామంలోని పలు బ్లాక్‌లలో భూముల సర్వే పనులు చేశారు. సర్వే పనులను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్లకు పలు సూచనలు చేశారు.

ఓటర్ల దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్

సి.బెళగల్: మండలంలోని బూత్ లెవల్ అధికారులు శనివారం జరిగే ఓటరు దినోత్సవానికి ఏర్పాట్లు చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 25వ తేదీ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

26న మాంసం విక్రయాలు నిషేధం

కర్నూలు (టౌన్): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 26వ తేదీన మాంసం విక్రయాలపై నిషేధం విధించినట్లు నగర పాలక ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబేళాలు, మాంసం దుకాణాలను ఆదివారం రోజున మూసివేయాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో సైతం మాంసాహారం విక్రయించరాదని ఆదేశించారు. నిషేధాజ్ఞలు విస్మరించే వ్యాపారులకు భారీగా జరిమానా విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు సాంస్కృతికాంశాల్లో పోటీలు

కర్నూలు కల్చరల్: రిపబ్లిక్ డే పురస్కరించుకొని కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు కొండారెడ్డి బురుజు సమీపంలోని పార్క్‌లో విద్యార్థులకు సాంస్కృతికాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.మనోహర్‌బాబు తెలిపారు. దేశభక్తి గీతాలు, భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా 88863 74796, 77029 44714 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్థానికంగా మందులు కొనేందుకు టెండర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి అవసరమైన అత్యవసర మందులు, సర్జికల్స్, ఇన్‌ప్లాంట్స్ స్థానికంగా కొనేందుకు టెండర్లు పిలుస్తున్నామని, ఇందుకు అవసరమైన మందులను ప్రతిపాదించాలని వైద్యులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో అన్ని విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవలకు సంబంధించి ప్రభుత్వం నుంచి కొత్త టార్గెట్లు వచ్చాయని, వాటిని అనుసరించి ఇప్పుడు మరింత పెంచి అమలు చేయాలని ఆదేశించారు. ఈ-హాస్పిటల్‌లో డిశ్చార్జ్ ఐపీ మాడ్యూల్స్‌ను ఇంకా మెరుగుపరచాలన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వీలైనంత త్వరగా సేవలు ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని ఓపీ నంబర్ 333 (వెల్‌నెస్ క్లినిక్) ప్రారంభించామని, ఇది సోమ, బుధవారాల్లో కొనసాగుతుందన్నారు. దీనికి సంబంధించి ఆయా విభాగాల నుంచి అవసరమైన రోగులను రెఫర్ చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చేలాగా చూడాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు. అన్ని ఓపీ విభాగాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంబంధిత సీనియర్ ఫ్యాకల్టీ వైద్యులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. న్యూ డయాగ్నోస్టిక్ విభాగం మొదటి అంతస్తులో హిమోగ్లోబినోపతి (ఐసీహెచ్‌హెచ్) రక్త పరీక్షల కేసుల నమోదు కోసం నమూనాలను ప్రతి మంగళ, శుక్రవారం ల్యాబ్‌కు పంపించాలని తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ సీతారామయ్య, సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు పాల్గొన్నారు.

కుంగిన ఆశలు..తప్పని ఎదురుచూపులు

- 2017లో కుంగిన అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్ట
- మరమ్మతులు చేయాలని సూచించిన అప్పటి ఇంజినీర్లు
- మరమ్మతుల కోసం రిజర్వాయర్ ఖాళీ
- సాగునీరు లేక పంటపొలాలు బీడు పెట్టుకుంటున్న రైతులు
- దృష్టి సారించని కూటమి ప్రభుత్వం



రిజర్వాయర్ కట్ట కుంగిన దృశ్యం (ఫైల్)

గడివేముల: మండల పరిధిలోని అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్ట 2017లో కుంగిపోయింది. అధికారులు ఉన్న నీటిని బయటకి వదిలివేసి ఖాళీ చేశారు. మరమ్మతులు చేయకపోవడంతో వందలాది ఎకరాలు బీడుగా మారాయి. 1987 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. మిడ్తూరు మండలం అలగనూరు గ్రామం సమీపంలోని కేసీ కెనాల్ 119 కి.మీ దగ్గర రిజర్వాయర్ నిర్మాణానికి రూ.3.06 కోట్లతో పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ మేరకు జీఓ ఎంఎస్ 327 జారీ అయ్యింది. 1993 వరకు దీనిని ఎవరూ పట్టించుకోలేదు. జైకా నిధులతో కేసీ కెనాల్ ఆధునికీకరించే పనుల్లో భాగంగా రూ.59.90 కోట్లతో అలగనూరును చేపట్టారు. పనులు ఆలస్యమైనా 2004లో పూర్తయ్యాయి. రిజర్వాయర్ కెపాసిటీ మూడు టీఎంసీలు. 2017–18 ఒక్కచోట కట్ట బలహీనపడి కుంగింది. అప్పటి ప్రభుత్వం కుంగిన ప్రాంతంలో తాత్కాలికంగా ఇసుక సంచులు వేసి నీటిని నిల్వచేశారు. కాలక్రమేణ మరింత బలహీన పడిపోవడంతో రిజర్వాయర్‌లో నీటిని నింపడం ప్రమాదకరంగా మారింది. కదిలిన యంత్రాంగం రిటైర్డ్ నీటిపారుదల శాఖాధికారులు, నిపుణులతో సర్వే చేయించారు. గత ప్రభుత్వం రూ.3.12 కోట్లు మంజూరు చేసింది. అయితే కట్ట కుంగిన ప్రాంతం మరింత పెరగడంతో రూ.18 కోట్ల దాకా ఎస్టిమేషన్ పంపారు. అంతలోనే ఎన్నికలు రావడంతో నిధులు మంజూరు కాలేదు. రిజర్వాయర్ కింద ఉండే గ్రామాల్లోని వందలాది ఎకరాలు బీడుగా మారాయి. ముఖ్యంగా గడివేముల, బూజునూరు, చిందుకూరు, గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది, పులిమద్ది గ్రామాల్లోని రైతులు, ప్రజలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. కుంగినప్పుడే రిజర్వాయర్ కట్టకు శాశ్వత మరమ్మతులు చేయించి ఉంటే బాగుండేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టి త్వరగా పూర్తి చేస్తామని ఎన్నికల సమయంలో ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. గత ఏడాది నంద్యాల జిల్లా కలెక్టర్ కట్ట కుంగిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించి అంచనాలు వేశారు. రివైజ్డ్ ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది.

ఇదీ సమస్య

కోర్టు కేసుల కారణంగా రిజర్వాయర్ ఎర్త్ బండ్ చాలా కాలంపాటు ఆగిపోయింది. లోతైన కొండ గట్టు పోర్షన్‌లో నేల స్థాయి కంటే తక్కువ పొరల కుదింపు జరగలేదు. ఈ రిజర్వాయర్ పనులు జరుగుతున్న సమయంలో గడివేముల నుంచి రోళ్లపాడు గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రోడ్డును తొలగించకుండా, ఎలాంటి ట్రెంచెస్ వేయకుండానే నిర్మాణం చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. నిపుణుల కమిటీ సైతం ఇదే అనుమానాన్ని వ్యక్తం చేసింది. రోడ్డు ఉన్న ప్రాంతం, గతంలో ఇక్కడ ఉండే చెరువులోకి నీరు వచ్చేందుకు ఉండే వాగు మట్టిని తొలగించక పోవడంతోనే బండ్ కుంగిందని తెలుస్తోంది. రిజర్వాయర్ లోపల వైపునకు 2.5 కి.మీ నుంచి 2.65 కి.మీ, 2.75 నుంచి 2.85 కి.మీ, 2.9 కి.మీ నుంచి 3.00 కి.మీ, 3.15 నుంచి 3.25 కి.మీ వరకు, పైభాగంలో 2.65 కి.మీ నుంచి 2.75 కి.మీ వరకు బండ్ కుంగింది. దిగువ భాగంలో కూడా కొన్ని చోట్ల నీరు సీపేజ్ అవుతున్నట్లు ఇంజినీర్లు గుర్తించారు.

నాడు పట్టించుకోని టీడీపీ

2017లోని ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల కుంగిన వెంటనే మరమ్మతు పనులు చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రిజర్వాయర్‌లో ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో రిజర్వాయర్‌లో కొంతమంది రైతులు పంటలు సాగు చేశారు. ఎన్నికల సమయంలోకూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

హామీ నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుంగిన కట్టకు మరమ్మతులు చేయించాలి. దీనిపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న రైతులను ఆదుకోవాలి. రిజర్వాయర్‌లో నీరు నిల్వ లేకుండా పోవడంతో పశువులు, ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తే బాగుంటుంది. మరమ్మతులు చేయిస్తే కుందూనదిలో నిత్యం తాగునీరు, సాగునీరు అందుతుంది.

–రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్, గడిగరేవుల

త్వరగా పూర్తి చేయాలి



రిజర్వాయర్ కట్ట 2017 సంవత్సరంలో కుంగింది. అప్పుడే మరమ్మతులు చేసి ఉంటే ఈ కష్టాలు వచ్చేవికావు. తాత్కాలికంగా సంచుల్లో ఇసుక నింపి వేసి మరమ్మతులు చేశారు. రిజర్వాయర్ కింద వందలాది ఎకరాలు బీడుగా మారాయి. రిజర్వాయర్ కట్టకు నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టి త్వరగా పూర్తి చేయాలి. గత ప్రభుత్వంలో రూ.18 కోట్ల వరకు అంచనాలు వేశారు. అంతలోనే ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది.

–ఉశేన్‌బాషా, కో– ఆప్షన్ సభ్యుడు



ప్రస్తుతం అలగనూరు రిజర్వాయర్ పరిస్థితి



ఖాళీగా ఉన్న రిజర్వాయర్

కుంటను తలపిస్తున్న మురుగు

గడివేముల: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మురుగునీరు రోడ్డుపైకి రావడంతో కుంటను తలపిస్తోంది. బీసీ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు నిలువ ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీటి నుంచి వచ్చే దుర్వాసన, దోమల వల్ల వివిధ వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



బీసీ కాలనీలో ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగు

విద్యుత్ వైరు చోరీ

వెల్దుర్తి: స్థానిక పంచాయతీ నీటి పథకానికి చెందిన విద్యుత్ మోటారు వైరు చోరీకి గురైనట్లు పంచాయతీ అధికారి లక్ష్మీనాథ్ తెలిపారు. పట్టణానికి తాగునీరందించే బ్రహ్మగుండం పథకానికి సంబంధించిన రెండు మోటార్ల దాదాపు 160 మీటర్ల వైరు బుధవారం రాత్రి చోరీకి గురికాగా, రూ.30 వేల నుంచి రూ.40వేల నష్టం సంభవించిందన్నారు. దీంతో తాగునీటి సరఫరాకు స్వల్ప అంతరాయం కలుగగా, చోరీ విషయంపై పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

కష్టపడే వారికి పదవులు వస్తాయి

–కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

కల్లూరు: పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి గుర్తింపుతో పాటు పదవులు వరిస్తాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పార్టీలో పాణ్యం నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన తిరుపాల్, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, హుస్సేన్ ఆలం, భవాని, గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం కాటసాని రాంభూపాల్ రెడ్డి, శివనరసింహారెడ్డిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



పాణ్యం: నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాణ్యం: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పాణ్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ రామన్, ఎన్ఎస్‌యూఐ బత్తిన ప్రతాప్‌చ అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో బోస్ కీలకప్రాత పోషించారన్నారు. ఆయన ధైర్యసాహసాలు, నాయకత్వానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జయంతిని పరాక్రమ్ దివాస్, శౌర్య దినంగా జరుపుతోందని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫరిదా నరేష్, జాషువా, రమేష్, వేణు గోపాల్, రాజు, ప్రతాప్, విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.



ఓర్వకల్లు: నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి

–ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి కౌసల్య నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గుర్తింపు కార్డుల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు, అసంఘటిత రంగంలోని కార్మికులకు ఈ-శ్రామ్ కార్డులను లేబర్ డిపార్టుమెంట్ ద్వారా ఇప్పించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్ధి తెలిపారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరిగే క్యాంపులో కార్మికులకు కార్డులను ఇప్పించనున్నట్లు వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాహన తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

సి.బెళగల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి వాహనదారులను హెచ్చరించారు. గురువారం పోలీస్ సిబ్బందితో కలిసి సి.బెళగల్ మండల కాంప్లెక్స్ వద్ద గూడూరు–ఎమ్మిగనూరు ప్రధాన రోడ్డుపై వాహన తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని 12 మంది వాహనదారులపై కేసు నమోదు చేసి, రూ.1,560 జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని కోరారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించి అన్నీ రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ శ్రీనివాసులుగౌడ్ ఉన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కోడుమూరు ఎంపీడీఓ రాముడు హెచ్చరించారు. గురువారం మండలంలోని వెంకటగిరి, గోరంట్ల, కోడుమూరులోని 4,5 గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవ్వరైనా విధులను నిర్లక్ష్యం చేసినా, బయోమెట్రిక్‌లో నమోదు లేకపోయినా వారికి జీతాలను నిలుపుదల చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులపై ఎంపీడీఓ వాకబు చేశారు.

నేడు వ్యవసాయ విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో 220 కేవీ లైన్ల ఏర్పాటు వల్ల కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు ఈనెల 24వ తేదీన వ్యవసాయ విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నూరు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కార్బైడ్ సబ్‌స్టేషన్‌కు 220 కేవీ నూతన లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మూడు మండలాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అలాగే క్యాంపు సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీలు, నగరాలలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కర్నూలు కార్బైట్ సబ్‌స్టేషన్ వరకు ఉన్న రెండు సర్క్యూట్‌లలో నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ శేషాద్రి ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఓర్వకల్లు మండలంలో వ్యవసాయ బోర్లకు తెల్లవారుజామున 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ సునీల్ బాబు తెలిపారు.

ఇలా చోరీ చేశాడు.. అలా దొరికిపోయాడు

కోడుమూరు రూరల్: ఓ ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్‌ను ఓ దొంగ చోరీ చేశాడు. అయితే సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గంటల వ్యవధిలోనే ఆ దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన గురువారం కోడుమూరులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లక్ష్మీనగర్‌లో నివాసముంటున్న రవిప్రకాష్ అనే వ్యక్తి యథావిధిగా రాత్రి తన ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేశాడు. అయితే ఉదయాన్నే చూస్తే బైక్ కన్పించలేదు. దీంతో సీసీ టీవీ ఫుటేజీ చూడగా, అందులో ఓ దొంగ తెల్లవారుజామున 3 గంటల సమయంలో బైక్ ఎత్తుకెళ్లిన దృశ్యం కన్పించడంతో కోడుమూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు బోయ రామకృష్ణగా గుర్తించి వెతుకగా, అక్కడే కొద్దిదూరంలో ఓ నిర్మానుష్యమైన ప్రదేశంలో బండిని దాచేందుకు యత్నిస్తూ పట్టుబడ్డాడు. గంటల వ్యవధిలోని చోరీ కేసును చేధించి బైక్‌తో పాటు, దొంగను పట్టుకున్న పోలీసుల ప్రతిభను ప్రజలు అభినందిస్తున్నారు. నిందితుడు రామకృష్ణను కోడుమూరు పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

నేతల పరామర్శ



ఎంపీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లె ఎంపీటీసీ సభ్యురాలు రంగమ్మ, వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ నాయకులు పరామర్శించారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు రంగమ్మ బావ పెద్ద బీమన్న అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మండల నాయకులతో కలిసి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ నరసింహుడు, కార్యదర్శులు మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, ముల్లా హారున్, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, నాయకులు లచ్చప్ప, లింగేష్, రామచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

యాగంటేశ్వరుని ఆదాయం రూ.1.30 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయాధికారులు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్‌కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వరస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.1.30 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో యాగంటేశ్వర, చెన్నకేశవ స్వామి హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 2023 మే 25వ తేదీ నుంచి 2025 జనవరి 23వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు చెప్పారు. మొత్తం రూ.1,30,068 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు శ్రీనివాసులు, చంద్రశేఖరప్ప, మధు, భద్రప్ప, రోశన్న, పుల్లన్న, యాగంటయ్య, ఆలయ సిబ్బంది ఉరుకుందయ్య, నాగరాజు, శేకర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

గడివేముల: బాల్య వివాహాలు చేసుకుంటే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని.. మానసికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు వస్తాయని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో వివిధ చట్టాలు, నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మహిళా సంబంధిత నేరాలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్, లోన్ యాప్ మోసాలు, బాల్య వివాహాలు, రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళలు ఏదైనా ఆపద సమయంలో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లపై క్లిక్ చేసేటప్పుడు లేదా డౌన్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, మొబైల్ ఫొటోలు, ఓటీపీలను ఎవరితో పంచుకోకూడదన్నారు. సైబర్ క్రైమ్, ఫేక్ లోన్ యాప్స్ మోసాలగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్‌లు వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేసి వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామేశ్వరరావు, హెచ్‌ఎం రఘు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 9 మంది గైర్హాజరు

పాణ్యం: మండల పరిధిలోని ఆర్జీఎం కాలేజీలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం షిఫ్ట్–1కు 166 మంది విద్యార్థులకు గాను 160 మంది హాజరయ్యారు. ఆరుగురు అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే షిఫ్ట్–2లో 166 మందికి గాను 163 మంది పరీక్షలు రాశారు. ముగ్గురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు.

వలసబండి కదిలింది..!



వాహనంలో గుంటూరుకు వలస వెళుతున్న కూలీలు

కోడుమూరు రూరల్: స్థానికంగా చేసేందుకు పనుల్లేక కూలీలు వలసబాట పట్టారు. రబీ కింద పంటల సాగు అంతంత మాత్రంగానే ఉండడం, స్థానికంగా పనులు దొరకక కోడుమూరులోని చిన్నబోయవీధికి చెందిన 20మందికిపైగా కూలీలు గురువారం పిల్లపాపలతో కలిసి గుంటూరు వలస వెళ్లారు. గతంలో మండలంలోని కొన్ని పల్లెల నుంచి మాత్రమే కూలీలు వలస వెళ్లేవారు. అయితే ఈ ఏడాది పంటల దిగుబడులు భారీగా తగ్గిపోవడం, పంటల సాగు లేకపోవడంతో చేసేందుకు పనులు దొరకని పరిస్థితి. దీంతో పట్టణంలోనూ కూలీలు వలస బాట పడుతుండడం గమనార్హం.